తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 222
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
బుధవారం, 27-03-2024

KISHAN COMPUTERS
SALES & SERVICE
Computers, Laptop Repair
Mother Board Repair,
Printers Repair,
Catrige Refilling,
New Catriges,
Ink Bottles, Accessories

Near MRO Office, Opp. Shamirpet Lake,
Shamirpet Mandal, Medchal Dist.
Cell: 80994 82143, 99488 05009



# కవిత కు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ

- తీహార్ జైలుకు తరలించి.. అక్కడే విచారణ జరిపే అవకాశం ?

**జయభేరి, న్యూ ఢిల్లీ, మార్చ్ 26**

;ఢిల్లీ లిక్కర్ స్కామ్లో అరెస్టైన ఎమ్మెల్సీ కవిత విషయంలో రౌస్ అవెన్యూ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈడీ కస్టడీ ముగిసిన నేపథ్యంలో ఆమెకు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించింది ధర్మాసనం. ఈ మేరకు తీర్పు వెలువరించింది కోర్టు. ఏప్రిల్ 9వ తేదీ వరకు కవిత జ్యూడీషియల్ కస్టడీలో ఉండనున్నారు. ఏప్రిల్ 9 న ఉదయం 11 గంటలకు కోర్టులో హాజరుపరచాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, కవితను కస్టడీకి ఇవ్వడం ఇది మూడోసారి. మొదట 7 రోజులు, ఆ తరువాత 3 రోజులు, ఇప్పుడు 14 రోజులు జ్యూడీషియల్ కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం. కవితను తీహార్ జైలుకు తరలించి.. అక్కడే విచారణ జరుపుతాతరని అధికార వర్గాలు చెబుతున్నారు.

కవిత బెయిల్ పిటిషన్.. ఏప్రిల్ 1వ తేదీన విచారణ కాగా, ఈ కేసులో కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ వేశారు. తన కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కవిత కోరారు. అయితే, ఈ పిటిషన్పై సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని కోర్టును ఈడీ కోరింది. దీంతో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ బెయిల్ పిటిషన్పై ఏప్రిల్ 1వ తేదీన విచారణ జరుపుతామని న్యాయస్థానం తెలిపింది.

**విచారణకు సహకరించడం లేదు..**

మంగళవారంతో కవిత ఈడీ కస్టడీ ముగిసింది. దీంతో ఆమెను ఈడీ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. జ్యూడీషియల్ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఈడీ అధికారులు కోరారు. మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాల్సిందేనని న్యాయస్థానంలో వాదించారు. కవిత విచారణకు సహకరించడం లేదని, మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని ఈడీ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టి తీసుకువెళ్లారు. కేజ్రీవాల్, కవితను కలిపి విచారించాల్సిన అవసరం ఉందని, అందుకే మరో వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. ఈ నేపథ్యంలో కోర్టు ఎమ్మెల్సీ కవితకు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది.

**కడిగిన ముత్యంలా బయటకొస్తా.. కవిత**

కోర్టుకు వచ్చే ముందు ఎమ్మెల్సీ కవిత సంచలన కామెంట్స్ చేశారు. ఈ కేసులో తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అన్నారు. ఇది మనీ లాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసు అని విమర్శించారు. తనను తాత్కాలికంగా జైలులో పెట్టొచ్చన్నారు. క్లీన్చిట్తో బయటకు వస్తానని అన్నారు. తాతను ఏ తప్పు చేయలేదని, అప్రూవర్గా మారనని అన్నారు. ఈ కేసులో ఒక నిందితుడు బీజేపీలోకి చేరితే.. 2వ నిందితుడికి బీజేపీ టిక్కెట్ ఇచ్చిందని కవిత వ్యాఖ్యానించారు. మూడో నిందితుడు రూ. 50 కోట్ల ఫండ్స్ బీజేపీకి ఇచ్చారని అన్నారు.

# 17 స్థానాల్లో 14 గెలవాలి



సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్:**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 14 పార్లమెంట్ స్థానాలు గెలవాలనే పట్టుదలతో ఉన్నాం. క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి ...మిగతాది 2 లో



# ఈ కేసులో మొదటి ముద్దాయిగా కేసీఆర్

- రెండో ముద్దాయి హరీష్రావు, మూడో ముద్దాయిగా అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో మొట్టమొదటి బాధితుడు సీఎం రేవంత్ రెడ్డి
- రెండో బాధితుడిని తానే.. రఘునందన్రావు
- డీజీపీ మహేందర్ రెడ్డి రిటైర్ అయిన తర్వాత ఎక్కడున్నారు
- అమెరికాకు ఇద్దరు వ్యక్తులను ఎవరు పంపారో తెలియాలి
- "కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మునుగోడు ఉప ఎన్నికలో ఓడిపోవడానికి కారణం కేసీఆర్ చేసిన ఫోన్ ట్యాపింగ్.
- హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్, ఎమ్మెల్సీ నవీన్ రావుని కూడా అరెస్ట్ చేయాలి
- కేసీఆర్, హరీష్రావు, కేటీఆర్ పాస్ పోర్టు సీజ్ చేయాలి.
- కేసీఆర్ మాస్టర్ స్కెచ్ వేసి హరీష్ రావుని కాంగ్రెస్లోకి పంపించాలనే ప్లాన్ చేస్తున్నాడు
- హైకోర్టు చీఫ్ జస్టిస్తో ఈ కేసుని విచారణ చేయాలి.
- సీబీఐపై నమ్మకం ఉంటే ఈ కేసుని సీబీఐకి అప్పగించాలి.
- ఈ కేసును ముక్కలు చేయకుండా సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్

...మిగతాది 2 లో

# భద్రాచలం రాములోరి కళ్యాణానికి ఆన్ లైన్ టిక్కెట్స్



**జయభేరి, ఖమ్మం, మార్చి 26:**

భద్రాచలం సీతారాముల కల్యాణం పట్టాభిషేకం వేడుకల్లో నేరుగా పాల్గొనేందుకు ఆన్లైన్లో టికెట్లను నేటి నుంచి విడుదల చేయనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 17న సీతారాముల వారి కల్యాణం, 18న మహా పట్టాభిషేకం వేడుకల్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.సీతారాముల కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవాల కోసం మార్చి 25వ తేదీ నుంచి ఆన్లైన్లో టికెట్లు అందుబాటులో ఉంటాయని ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని భావించే భక్తులు ఆన్లైన్లో ముందే టికెట్లు బుక్ చేసుకోవాలని ఆలయ అధికారులు సూచించారు.భద్రాచలం సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ 17న శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు, ప్రత్యక్షంగా కళ్యాణం, పట్టాభిషేక ...మిగతాది 2 లో



# టెట్ ఫీజు తగ్గించే యోచన

**జయభేరి, హైదరాబాద్, మార్చి 26:**

తెలంగాణలో టెట్ పరీక్ష ఫీజులు భారీగా పెంచడంపై నిరుద్యోగులు, వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వం దిగినట్లు తెలుస్తోంది. గతంలో టెట్ ఒక పేపర్కు రూ.200 ఫీజు ఉండగా... దాన్ని రూ.1000కి పెంచింది. ఇక రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు గూబ గుయ్యిమనిపించింది.. గతంలో రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రూ.2,000కు పెంచేసింది.ఈ నేపథ్యంలో ఫీజులను ఈ స్థాయిలో పెంచడంపై ...మిగతాది 2 లో

# కలుషిత నీటి సమస్యలు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 26:**

పేరుకు గ్రేటర్ హైదరాబాద్.. కానీ కదిలిస్తే ఎన్నో సమస్యలు కళ్ల ముందుంటాయి. ఏ సిటీకైనా కనీస వసతులతో పాటు మంచినీటి సౌకర్యం ముఖ్యం. కానీ గ్రేటర్ హైదరాబాద్ లో కొన్ని చోట్లా ఇప్పటికే జనాలు కలుషిత నీటిని తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాల్లో ముఖ్యంగా రెండో వార్డులో తాగునీరు కలుషితమవుతుండటంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులకు బురద నీరే తాగునీరుగా మారింది. అయితే గత కొన్ని రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతుంది, దీంతో నీటి ద్వారా వచ్చే వ్యాధులు అనేకం నమోదవుతున్నాయని స్థానికులు చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.నీటి నాణ్యత సరిగా లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదని, క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ (క్యూఏ అండ్టీ) విభాగం లేకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు వాపోతున్నారు. ఎస్ సీబీ పంప్ హౌజ్ లకు హెచ్ ఎండబ్ల్యూఎస్ ఎస్ బీ నీటిని సరఫరా చేసిన తర్వాత నీటి నాణ్యత తనిఖీలు నిర్వహించడం లేదు. అయితే సిటీజనం తాగునీటి సమస్యను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. గన్ బజార్, రసూల్పురా, కార్ఖానాలోని పలు నివాస కాలనీలు ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. 'ముఖ్యంగా కంటోన్మెంట్ లో తాగునీటి సమస్య అంతులేని సమస్యగా మారింది. ప్రతి ఐదు రోజులకు ఒకసారి సక్రమంగా నీటి సరఫరా జరగకపోవడమే కాకుండా నీటి నాణ్యత కూడా సరిగ్గా ఉండటం లేదు. కొన్నిసార్లు బురద నీరే వస్తోంది. అది కూడా దుర్వాసనతో ఉంటుంది అని కార్ఖానా నివాసి రమేష్ తన బాధను వ్యక్తం చేశాడు."చాలా రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుండటం, కాలనీవాసులు అవి తాగుతుండటంతో చాలామంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నీరు తాగడానికి సరైంది కాదు అని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కలుషిత నీటిని తాగలేక వాటర్ క్యాన్లు కొనుగోలు ...మిగతాది 2 లో



మొదటిపేజీ తరువాయి

## మొదటి ముద్దాయిగా కేసీఆర్

ఫోన్ ట్యాపింగ్ కేసులో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పలు సంచలన విషయాలను బయటపెట్టారు. ఈ కేసులో రెండో బాధితుడిని తానేనని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఫోన్ ట్యాపింగ్ను చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో మొట్టమొదటి బాధితుడు ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి అని చెప్పారు. 2015లో ఓటుకు నోటు కేసులో ఫోన్ ట్యాప్ చేసి ఆయన్ని అరెస్ట్ చేశారని చెప్పారు. మంగళవారం నాడు సంగారెడ్డిలో రఘునందన్‌రావు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ నేత BL సంతోష్ ఫోన్ను కూడా ట్యాపింగ్ చేశారని చెప్పారు. BL సంతోష్ని అనవసరంగా ఈ కేసులో ఇరికించారని అన్నారు. ఎవరికి నచ్చినట్టు ఈ కేసును ముక్కలు చేయకుండా సమగ్రమైన విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. గతంలో రేవంత్ బిడ్డ పెళ్లికి పెరోల్ మీద ఆయన బయటికి వచ్చారని అన్నారు. సీఎం రేవంత్ ఫోన్ ట్యాపింగ్ చేసిన పోలీసు అధికారులను ఎందుకు క్షమిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన తర్వాత డీజీపీకి అటాచ్ అయిన శ్రీనాథ్‌రెడ్డి ఎవరని నిలదీశారు. డీజీపీ మహేందర్ రెడ్డి రిటైర్ అయిన తర్వాత ఎక్కడున్నారని రఘునందన్‌రావు ప్రశ్నించారు. అమెరికాకు ఇద్దరు వ్యక్తులను ఎవరు పంపారో తెలియాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎప్పుడు, ఎంతకు కొన్నారు తెలియాలని చెప్పారు. సీఎం రేవంత్ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. ఆయనకు నచ్చినట్టు విచారణ జరిపిస్తే ఎలా అని ప్రశ్నించారు. తాను దుబ్బాక ఉప ఎన్నికలో పోటీ చేసినప్పుడు అప్పటి మంత్రి హరీష్ రావు, కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేశారని అన్నారు. ఓ టీవీ ఛానెల్లో ఫోన్ ట్యాపింగ్ చేస్తారా ఇంతకీ దిగజారుతారా అని మండిపడ్డారు. తాను బాధితుడిగా మాట్లాడుతున్నానని అన్నారు. ఈ కేసులో మొదటి ముద్దాయిగా కేసీఆర్, రెండో ముద్దాయి హరీష్‌రావు, మూడో ముద్దాయిగా అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని.. ఆ తర్వాతే మిగతా పోలీస్ ఆఫీసర్లను ఈ కేసులో విచారించాలని కోరారు.

రేవంత్ ఫోన్ని ట్యాపింగ్ చేయమని కేసీఆర్ చెప్పారు.. మరి ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాపింగ్ చేసే అధికారం ఎవరికి లేదని రఘునందన్‌రావు అన్నారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మునుగోడు ఉప ఎన్నికలో ఓడిపోవడానికి కారణం కేసీఆర్ చేసిన ఫోన్ ట్యాపింగ్. రెండో ముద్దాయి కేటీఆర్, మూడో ముద్దాయి హరీష్ రావు, నాలుగో ముద్దాయి జగదీష్ రెడ్డి. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ కేసును వాడుకుంటారా నిజాలు తెలుస్తారా సీఎం రేవంత్ చెప్పాలి. ఎమ్మెల్యేలు పార్టీ మారుతామంటే కేసీఆర్ బెదిరించి ఇలా ప్లాన్ చేశారు. హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్, ఎమ్మెల్సీ నవీన్ రావుని కూడా అరెస్ట్ చేయాలి. ఇప్పటికే ముగ్గురు విదేశాలకు పారిపోయారు అంటున్నారు.. వీళ్లని కూడా విదేశాలకు పొమ్మంటున్నారా. 2015లో డీజీపీ ఎవరో అతన్ని మొదటగా విచారించాలి. హైకోర్టు జడ్జీలు, సినిమా హీరోయిన్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ పాస్ పోర్టు సీజ్ చేయాలి. నిన్న మాజీ మంత్రులు ముగ్గురు రహస్యంగా సమావేశం అయ్యారు. కేసీఆర్ మాస్టర్ స్కెచ్ వేసి హరీష్ రావుని కాంగ్రెస్లోకి పంపించాలనే ప్లాన్ చేస్తున్నాడు. ఈ విషయానికి సంబంధించిన వార్తలు కూడా వస్తున్నాయి. ఈనెల 19 మార్చి రాత్రి 10.15గంటలకి సీఎం రేవంత్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఒకే విమానంలో ఎందుకు ప్రయాణం చేశారు. విమానంలో రెండు గంటలు ఇద్దరు ఏం మాట్లాడారో తెలియాలి. రూ. 13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను ఒక సంస్థ నుంచి ఎత్తుకొచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వారినందరిని విచారించాలి" అని రఘునందన్‌రావు అన్నారు. "సీఎం రేవంత్, డీజీపీ ఈ కేసును పూర్తిస్థాయిలో విచారించాలి. నాకు నోటీస్లు పంపిస్తే నా దగ్గర ఉన్న ఆధారాలు సమర్పిస్తాను. ఈ కేసులో కొందరిని ఇరికించి, మరి కొందరిని కాపాడే కుట్ర జరుగుతోంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. కర్ణాటక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేశారు. సీఎం రేవంత్, హరీష్‌రావు మధ్య ఏం సంభాషణ జరిగింది. మెదక్ ఎంపీ కాంగ్రెస్ టికెట్ గురించి చర్చ జరిగిందా..? 26 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్లోకి వస్తాను అన్నావా..? మెదక్ ఎంపీ ఎన్నికల వరకు మా ఎమ్మెల్యేలకు కాంగ్రెస్లోకి తీసుకోవాలని చెప్పావా..? అసలేం మాట్లాడారో తెలియాలి. BL సంతోష్ కేసులో ఆడియో, వీడియోలు కేసీఆర్ చూపెట్టారు. టెలిఫోన్ ట్యాపింగ్ జరగకపోతే ఇవన్నీ కేసీఆర్కి ఎలా తెలుస్తాయి. హైకోర్టు చీఫ్ జస్టిస్తో ఈ కేసుని విచారణ చేయాలి. సీబీఐపై నమ్మకం ఉంటే ఈ కేసుని సీబీఐకి అప్పగించాలి. అందరూ అధికారులు మళ్లీ రేవంత్ చుట్టే చేరుతున్నారు... ఆయన జాగ్రత్తగా ఉండాలి. హరీష్‌రావు శ్రీమతి, కవిత భర్త ఫోన్లని కూడా కేసీఆర్ ట్యాపింగ్ చేశారు" అని రఘునందన్‌రావు తెలిపారు.

## కలుషిత నీటి సమస్యలు

చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయా కాలనీవాసులు. వేసవికాలం ముందు ఉన్నందున హైదరాబాద్ నగర ప్రజలు తాగు నీటిని ఇతర అవసరాల కోసం వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై బోర్డు ప్రకటించింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో తాగునీటికి డిమాండ్ ఏర్పడుతున్నదని, మార్చి లోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో వాటర్ డిమాండ్ పీక్ స్టేజ్ కి వెళ్తుందని హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ వాటర్ సప్లై బోర్డు అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు అందరికీ తాగునీరు సరఫరా చేయాలంటే వృధాను అరికట్టాలని, ఇతర వాణిజ్య అవసరాలకు తాగునీటిని వినియోగించడం నిలుపుదల చేయాలని నిర్ణయించామని వారి పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలను గండిపేట, ఉస్మాన్ సాగర్, నాగార్జునసాగర్, గోదావరి జిల్లాలో తీరుస్తున్నాయి. గత ఏడాది ఆశించినత స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో జలాశయాలలో అంతర్ధమాత్రంగానే నీరు నిల్వ ఉంది. ఈ నీటిని పొదుపుగా వాడేలా ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇక ప్రస్తుతం మన పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపు దాల్చింది. బెంగళూరు నగరంలో క్యాన్ నీటి కోసం ప్రజలు గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. ఒకానొక దశలో బెంగళూరులో నెలకొన్న తాగునీటి ఎద్దడి వల్ల ఐపీఎల్ మ్యాచ్లు నిర్వహించాలా? వద్దా? అనే సందిగ్ధం ఏర్పడింది. చివరికి బెంగళూరు వాటర్ సప్లై బోర్డు మురుగు నీటి నుంచి శుద్ధి చేసిన జలాన్ని సప్లై చేస్తామని చెప్పడంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ల నిర్వహణకు మార్గం సుగమమయింది. కాకపోతే బెంగళూరులో నెలకొన్న తాగునీటి ఎద్దడి నేపథ్యంలో అక్కడి పురపాలక అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. తాగునీటిని కమర్షియల్ అవసరాలకు వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చివరికి వాహనాల వాషింగ్ సెంటర్ లపై కూడా నిఘా పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో తాగునీటితో వాహనాలను కడగొద్దని, అలా చేస్తే భారీగా అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. బెంగళూరు లాగానే హైదరాబాద్ కూడా కాస్మో పాలిటన్ సిటీ కావడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై బోర్డు అధికారులు పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఇందులో భాగం గానే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు.

## 17 స్థానాల్లో 14 గెలవాలి

సంబంధం ఉంది. అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్ దానం నాగేందర్ ని పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మన వంద రోజుల పరిపాలనకు రెఫరెండం. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలు గెలిచి సోనియమ్మకు కృతజ్ఞత చెబుదాం. పదేళ్లు మోదీ ప్రధానిగా ఉన్న మోదీ ఏం చేశారు? ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదు.. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురాలేదు. బుల్లెట్ ట్రైన్ గుజరాత్ కు తీసుకెళ్లిన మోదీ.. వికారాబాద్ కు ఎంఎంటీఎస్ రైలు తీసుకురాలేదని అన్నారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేసుకున్న మోదీ... మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు రాకుండా బీజేపీ ఎందుకు మోకాలడ్డుతోంది? ఏం చూసి మూడోసారి మోదీకి ఓటు వేయాలని బీజేపీ అడుగుతున్నారు? బీజేపీ నేతల వ్యవహారం పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలన్నట్లుంది. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది చక్కని అవకాశం. పార్లమెంట్ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారు. పార్టీకి అండగా నిలబడి సోనియమ్మ నాయకత్వానికి బలపరచాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నాం. మళ్లీ అక్కడే ఏప్రిల్ 6 లేదా 7 న జాతీయస్థాయి గ్యారెంటీలను ప్రకటించుకోబోతున్నాం. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించబోతున్నాం. ఈ జనజాతర సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరవుతారని అన్నారు.

# సీతక్క జర ప్రయాణికుల పరిస్థితి ఒక్కసారి చూడక్కా

- ములుగులో మంత్రి సీతక్క ఇలాకలో
- బస్సు కోసం ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు
- చెప్పుకోవడానికి మాత్రమే జిల్లా కానీ బస్సు సౌకర్యాలు లేని జిల్లా




**జయభేరి, ములుగు :**

ములుగు జిల్లా లోని బస్ స్టేషన్ ప్రాంగణంలో 8 అయితే చాలు హనుమకొండ కు వెళ్లడానికి ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. సాక్షాత్తు సీతక్క ఇలాకాలో ప్రయాణికులు వరంగల్ కానీ హైదరాబాద్ కానీ వెళ్లాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిందే. బస్సుల వివరాలను అడిగితే, డిపో మేనేజర్ కూడా బస్సులు ఏ సమయానికి వస్తాయో, ఏ సమయానికి వెళ్తాయో కూడా అవగాహన రాహిత్యంతో ప్రజలకు సమాధానం చెప్పడంపై ప్రజలు మండిపడుతున్నారు. కనీసం బస్సులు నడపలేని పరిస్థితి ఎందుకు అవుతుందో తెలియట్లేదని ఒక మంత్రి సీతక్క ఇలాగా ములుగులో ఒక్క బస్సు సమయానికి కూడా రాదు. కేవలం ములుగు బస్ స్టేషన్ అనేది చెప్పుకోవడానికి తప్ప ఏ బస్సు ఏ సమయానికి వస్తుందో సమయం సూచికలు కూడా పాటించలేని దుస్థితి. ప్రయాణికులు సీతక్క ఇలాగాలో మాకు సీతక్క ఉండి ఏం లాభం అని ప్రయాణికులు గరంమవుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై వెంటనే స్పందించి ములుగులో డిపో ఏర్పాటుకు బస్సులు సమయానుకూలంగా నడిపించేందుకు అధికారులకు సూచనలు ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**అదేమీ జిల్లా కాదు చెప్పుకోదగ్గ పట్నం కాదు**

భూపాలపల్లి జిల్లాకు దగ్గరలో ఉన్న పరకాల మండలం ఒక డిపో ఉండడం అనేది మంచి విషయం అయినప్పటికీ, ములుగును జిల్లాగా ప్రకటించి కనీస బసౌకర్యాలు లేని ములుగు వెనుకబడుటకు కారణం నిలువెత్తు నిదర్శనం. రవాణా సౌకర్యాలు ఉంటే పల్లె పల్లెలు అభివృద్ధిలో నడుస్తాయి అన్న విషయాన్ని మరిచి మంత్రి ప్రవర్తించడం అనేది ప్రయాణికులు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఓట్ల కోసం మాత్రం ఆ పని చేస్తాం ఈ పని చేస్తాం అని హామీలు ఇవ్వడం తప్ప చేసేదేమీ లేదని స్పష్టంగా అర్థం అవుతున్నది. కేవలం ఫోటోలకు ఫోజు చేయడం కాకుండా ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయిందని అనడంలో సందేహం లేదు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి ఎన్ని సార్లు తీసుకుపోయినా ఫలితం శూన్యమని ప్రయాణికులు విన్నవించుకున్నారు. ఇప్పటికైనా మంత్రి హోదాలో ఉన్న సీతక్క కనీసం బస్ డిపో సౌకర్యం కల్పించలేని మంత్రిగా ఉండడం అనేది బాధాకరమైన విషయమని ములుగు జిల్లా వాసులు బాధకు లోనయ్యారు.

**సమస్య పరిష్కారానికై ప్రజాదర్బార్లో ఫిర్యాదు**

ఇదిలాగే ఉంటే ప్రజాదర్బార్లో సమస్యపై ములుగు జిల్లాలో బస్ డిపో ఏర్పాటుకై తెలంగాణ నిరుద్యోగుల సమితి ఫిర్యాదు చేస్తుందని పేర్కొన్నారు.

## టెట్ ఫీజు తగ్గించే యోచన

అభ్యర్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోచింగ్, శిక్షణ, హాస్టల్ ఫీజులకే వేల రూపాయలు ఖర్చుపెడుతున్న తమకు పెరిగిన పరీక్ష ఫీజలు చెల్లించడం మరింత భారంగా మారిందని, ఇలా చేయడం తగదని.. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని కోరుతున్నారు. ఫీజుల వ్యవహారం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లింది. ఫీజుల పెంపు అధికారుల స్థాయిలోనే జరిగిందని సీఎంవో వర్గాలు సీఎంకి వెల్లడించినట్లు తెలిసింది. దీంతో సమస్య తీవ్రతరం కాకముందే ఫీజు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**మార్చి 27 నుంచి టెట్ దరఖాస్తులు..**

రాష్ట్రంలో మార్చి 15న టెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. మార్చి 27న దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుంది. సరైన అర్హతలున్నవారు ఏప్రిల్ 10 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థుల సౌలభ్యం కోసం హెల్ప్లైన్లను సైతం విద్యాశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు మే 15 నుంచి హాల్టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మే 20 నుంచి జూన్ 3 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయాతేదీల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు పేపర్1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పేపర్2 పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష ఫలితాలను జూన్ 12న విడుదలచేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. టెట్ పేపర్1కి డీఈడీ అర్హత ఉండాలి. ఇంటర్లో జనరల్ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.. ఒకవేళ అభ్యర్థులు 2015లోపు డీఈడీలో చేసిఉంటే జనరల్ అభ్యర్థులకుఇంటర్లో 45 శాతం, ఇతరులకు 40 శాతం మార్కులు ఉన్నా అర్హులే. టెట్ పేపర్2కి డిగ్రీ, బీఈడీ ఉండాలి. జనరల్ అభ్యర్థులకు డిగ్రీలో 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు ఉండాలి. 2015లోపు బీఈడీ అయితే జనరల్కి 50 శాతం, ఇతరులకు 40 శాతం మార్కులు ఉన్నా అర్హులే. సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయవచ్చు. 'డీఎస్సీ కంటే ముందే టెట్ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని సుమారు మూడు లక్షల మంది డీఎడ్, బీఎడ్ అభ్యర్థులకు ప్రయోజనం కలుగనుంది. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఫిబ్రవరి 29న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ను విడుదల చేసింది. డీఎస్సీ రాతపరీక్షలను జులై 17 నుంచి 31 వరకు ఆన్లైన్ లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెట్ నిర్వహణ తప్పనిసరి కావడంతో డీఎస్సీ దరఖాస్తు గడువును విద్యాశాఖ జూన్ 20 వరకు పొడిగించింది. డీఎస్సీకి దరఖాస్తు చేసేవారి సందేహాలు తీర్చేందుకు అధికారులు హెల్ప్డెస్క్ను ఏర్పాటుచేశారు. సాంకేతిక సహాయం కోసం విద్యార్థులు 91541 14982, 63099 98812 నంబర్లతోపాటు, helpdesk tsdsc2024@gmail.com ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలనుకునేవారు, ప్రతి ఉద్యోగం కోసం రూ.1000 అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.


## రాములోరి కళ్యాణానికి ఆన్ లైన్ టిక్కెట్స్

కార్యక్రమాలను వీక్షించేందుకు సెక్టార్ టికెట్లను సోమవారం నుంచి ఆన్లైన్లో అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రకటించారు. శ్రీరామనవమి రోజు ఉభయదాతల సేవా టికెట్ రుసుము రూ.7,500గా నిర్ణయించారు. ఈ టిక్కెట్పై ఇద్దరికి ప్రవేశం ఉంటుంది. రూ.2500, రూ.2000, రూ.1000, రూ.300, రూ.150 టికెట్లపై ఒక్కరికి ప్రవేశం కల్పిస్తారు. 18వ తేదీన జరిగే పట్టాభిషేక మహోత్సవం సెక్టార్ టికెట్ల ధరను రూ.1500, రూ.500, రూ.100గా నిర్ణయించారు. ఈ సేవల టిక్కెట్లను భద్రాద్రి ఆలయవెబ్సైట్ https://bhadradritemple.telangana.gov.in/fservices/index.php?sid=1 వెబ్సైట్ నుంచి పొందవచ్చని ఈవో రమాదేవి తెలిపారు. స్వామి వారి కల్యాణం రోజున ప్రత్యక్షంగా రాలేని భక్తులు పరోక్ష పద్ధతిలో తమ గోత్రనామాలతో పూజ చేయించే వెసులుబాటునూ కూడా కల్పించారు. దీని కోసం రూ.5 వేలు, రూ.1116 టికెట్లనూ వెబ్సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చు. ఆన్లైన్ ద్వారా సీతారాముల కళ్యాణం సెక్టార్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు ఏప్రిల్ 1 నుంచి 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు రామాలయ కార్యాలయంలో టిక్కెట్లు పొందాల్సి ఉంటుంది. టిక్కెట్ బుక్ చేసుకున్న వారు తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ ఐడీ కార్డులను చూపించి టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి నుంచి భద్రాచలం రామాలయం, తానీషా కల్యాణ మండపం, గోదావరి బ్రిడ్జి సెంటర్లోని ఆలయ విచారణ కేంద్రం, ఆర్డీవో కార్యాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లలో నేరుగా టికెట్లను విక్రయించనున్నారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# జక్కని వారి స్మృతి పద్య కావ్యం వరలక్ష్మీ ద్విశతి!

పుస్తక సమీక్ష

**పద్యకృతి పేరు: వరలక్ష్మీ ద్విశతి, రచయిత: జక్కని వేంకటరాజం, పేజీలు: 75, రురుకృప ప్రచురణలు, సిరిసిల్లా. వెల: 75, కవిగారి చరవాణి నంబర్: 944021734.**






**జక్కని వేంకటరాజం**
రచయిత
**చరవాణి నంబర్: 944021734.**

యోగా ఆచార్యులు, సాహితీ, ఆధ్యాత్మిక సంపన్నులైన జక్కని వెంకట రాజం గారి స్మృతి కావ్యం వరలక్ష్మీ ద్విశతి. ఇందులో రెండు వందల పద్యాలున్నాయి. ముందు మాటలు ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప, సాహితీ రత్న, అష్టావధాని డా. గంద్ర లక్ష్మణ రావు, యోగాచార్య డా. పైళ్ల సుదర్శన్ రెడ్డిలు రాశారు. వీరి అర్ధనారీశ్వరి శ్రీమతి వరలక్ష్మీ గారి ద్వితీయ వర్థంతి ని పురస్కరించుకొని, వీరు బాధతో, కదిలిన హృదయాన్ని పదిల పరుచుకొంటూ అద్భుతమైన పద్యాలలో ఆమెపై స్మృతి కావ్యాన్ని రాశారు. పద్యాలు రసగుళికలై, సరళంగా ఉన్నాయి. సామాన్యుడికైనా అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. తన జీవన సహచరితో ఉన్న అనుబంధం, తన ఊరు, ఇల్లు, చదువులు, తన నడవడిక వైఖరులు, ఉద్యోగం, బాల్యం, బాల్యంలో ఒకే పాఠశాలలో చదువుకోవడం, పెళ్ళి, పిల్లలు, వారి పెళ్ళిళ్ళు, పండుగలు, ఆధ్యాత్మిక యాత్రలు, పిల్లల పెళ్ళిళ్ళు, మనువల సందడి, చుట్టాల ఇంటికి పయనం, అక్కడ గడపడం, యోగా ప్రాధాన్యతలు, ఇంటి కోడలిగా తన అమ్మతో ఉన్న అనుబంధాన్ని, అతిథుల ఆదరణాన్ని గూర్చి పద్యాలలో జక్కని వారు చక్కగా చిత్రీకరించి రాశారు. ఈ పద్యాలు చదువుతుంటే భగవద్గీతలోని విషాద యోగం గుర్తుకు తెస్తుంది. అత్యంత కడు విషాదంగా తన భావ ప్రకటనను చేశారు. వేదనలను, బాధలను, విచారాన్ని, దు:ఖాలను, శ్లోకాలను మనతో పంచుకొంటాడు. తనతో తన జీవన సహచరి పంచుకొన్న అనుబంధాలను, విశిష్ట సందర్భాలను చక్కగా రాసి, పాఠక లోకానికి ఆమెను ఉన్నతమైన ఆదర్శ కుటుంబంలోని కోడలుగా పరిచయం చేస్తారు. అయితే ఇందులో విషాదాన్ని మినహాయిస్తే, తాను తిరిగిన యాత్రలను, చుట్టాల ఇంటికి వెళ్ళే సందర్భాలను ఆసక్తిగా మలిచాడు. ఒక రకంగా చెప్పాలంటే కవి గారి జీవిత చరిత్ర,తో పాటు ఇంటి చరిత్రగా అభివర్ణించవచ్చును. ముందు మాటలు రాసిన పండితులు పత్నీ వియోగపు ప్రాముఖ్యత గూర్చి సవివరంగా చెప్పారు. భార్యతో అన్యోన్య దాంపత్య కాపురం చేసి, ఇల్లుఇల్లాలుగ మెదిలిన ఆదర్శ నారీ వరలక్ష్మీ గారి మృతి కవిగారిని భాధించిన సందర్భాన్ని చిరస్మరణీయం చేశాడని వారు ప్రశంసించారు. ఇది భావ కవిత్వానికి సంబంధించిన ప్రక్రియే అయినప్పటికినీ, యదార్థమైన జీవిత సంఘటనలు చోటు చేసుకొని ఉండటం ఈ కావ్యం లోని ప్రత్యేకతలని ఆత్మీయంగా ముందు మాట రాసిన ఆచార్య మసన చెన్నప్ప గారు కితాబు ఇవ్వడం గొప్పదే. వెంకట రాజం గారు పద్య, వచన కవిగా పేరు గాంచారు. పద్య రచనా ప్రక్రియలో ఈ కావ్యాన్ని వెలువరించి, పద్య కవిత్వానికి సుగంధాలు అద్దారని అన్నారు. వీరు రాసుకొంటూ పోతే రెండు వందల పద్యాలుగా తయారై, జీవిత మధనాన్ని ఒక స్మృతి కావ్యంగా ఆవిష్కరించారని డా.గంద్ర లక్ష్మణ రావు గారు ప్రశంసించారు.

ఇహ వీరి పద్యకావ్యంలోకి వెడితే, ఈ కావ్యాన్ని తన అర్ధాంగి వరలక్ష్మీ గారికే అంకితం ఇచ్చారు. సీసాలు, తేట గీతులు, ఆట వెలదులు, సీస మాలలు ఇందులో పరిపుష్టంగా మలచబడి ఉన్నాయి. అరవై పేజీలలో పూర్తి చేశారు. నిండు ముత్తైదువగా ఉన్న తన భార్య ఫోటోనే కవర్ పేజీగా వేశారు. లోపలి పేజీలలో, వెనుక పేజీలలో కలర్ లో తన భార్య, బంధుజనులతో, యోగా బ్రహ్మ రుషి ప్రభాకర్ గారిని సన్మానించే ఫోటోలతో వేసి, స్మృతి కావ్యానికి మరింతగా మెరుగులు దిద్దారు. వెనుకాల పేజీలో తన అర్ధాంగితో ఉన్న వివిధ సందర్భాలలోని ఫోటోలను వేసి, తన జ్ఞాపకాలను పదిలం చేసారు. ఇది కవి గారి ఎనిమిదవ రచన. ఇందులో పారమార్థిక చింతన, వియోగిత ధు:ఖభావనలు మిన్నంటాయి. పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక స్థలాల సందర్శనా సమాచారం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే సార్థకమైన పద్యకృతి ఇది. కన్న వారింటికి కౌసల్యయై ఉండి వరలక్ష్మీ రూపాన తన ఇంట అడుగు పెట్టావని, కష్టసుఖాలందు, కలిమి లేముల యందు కలిసి బతికినామన్న సందర్భాన్ని గొప్పగా చెబుతాడు. దేహమును వీడి దేవివైతి వని ఆమె తలపుల్లోకి మునిగి పోతాడు. ఎంతటి విషాద భార్యా వియోగాన్ని ఆవిష్కరించడంలో జక్కని వారు చూపిన మానసిక క్షోభను, కన్నీళ్ళ వేదనను, వియోగ చింతనను మనం అర్థం చేసుకోగలం. ఆధ్యాత్మిక యాత్రలలో భాగంగా ఇలా కాశీ క్షేత్రాన్ని సందర్శించిన విధానాన్ని ఇలా చెప్పాడు. కాశీ క్షేత్రమున కనుల నిండ, విశ్వనాధుని వీక్షించితిమి విమలముగాను అని అంటాడు. నదుల స్నానానికై గంగా యమున వంటి త్రివేణి సంగమాలలో స్నానమాడామని, చివరకు ప్రేమ యాత్రలో భాగంగా చెప్పబడే తాజ మహల్ ను వీక్షించినట్లుగా చెప్పుకొంటాడు. కలుషితం గాని గంగను కాంచినామని, మానసా దేవిని ఆరాధించుకొన్నట్లుగా చెప్పుకు పోతాడు. ఇలా నదీమ తల్లుల సౌభాగ్యాన్ని వర్ణించి చెబుతాడు. ఆనందమయమైన సందర్భాలను కూడా ఈ కవి కృతిలో రికార్డు చేశారు. తాజ్ మహల్ ను ఆగ్రాలో తనివి ధీర వీక్షించినామని, వింత శోభల్లో ఫోటోలు దిగామని ఆ తలపులను పంచుకొంటాడు. బుద్ధగయను సందర్శించు కొన్నామని నీరజాక్షి అని సంభోధిస్తాడు. ఇందులో తన దైన యోగా మార్గాన్ని పంచుకొంటాడు. ధ్యానమేది, మనకపుడు జ్ఞానమేదని అంటాడు. మౌనమే ఆభరణంగా నిలిచి పోయిందని కొసమెరుపు వేస్తాడు. ముప్పై ఏళ్ళ కిందట అలహాబాద్ లోని ఆనంద భవనాన్ని చూశామని, అవి కొద్ది కొద్దిగా గుర్తున్నాయని చెప్పుకొంటాడు. మహారాష్ట్రలోని షోలాపురం, తుల్జాపురం, పండరిపురం, అహమద్ నగరాలను, అమ్మవార్లను, దేవుళ్ళను చూశాక, చుట్టాల ఇళ్ళకు వెళ్ళి బంధువులను కలిసి, హాయిగా గడిపాము. తదుపరి షిరిడీకి వెళ్ళిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకొని విచార పడతాడు. షిరిడి సాయిది కూడా గురు స్థానమే కదా. ఇలా ఆధ్యాత్మిక, ప్రయాణ సంఘటనలను గుర్తుకు తెచ్చుకొంటూ వాటిని రసరమ్యమైన పద్యాలలో బంధించాడు. కవి గారి కొన్ని వియోగ భావనలు. ఉదాహరణకు, నీవు నా అర్థ దేహము నుండి తొలగి పోవగ నేను తొట్రు పడితిని అని వాపోతాడు. అత్త సేవలు జేసినయట్టి సాధ్వి, బంధనాలన్ని త్రెంచుకు బయటపడితి|| అని అంటాడు. ఇంతి ఇన్నాళ్ళు నీబాధలంతమాయె/నీవు కోరిన శాశ్వత నిద్రదొరికె/నేను నొంటరినైతిని నీవు లేక/ఇంకముందేట్లు గడుచునో ఎరుగనైతి|| అంటూ తన వియోగ భారాన్ని మనతో పంచుకొంటాడు. నాటకాలలో కొన్నాళ్ళు నడిచినాను/సాహితీ సభలనుచునే సాగినాను/కొన్ని యేండ్లట్లు గడిచెను కోమలాంగి/అడ్డునాకీవు చెప్పలేదమ్మ!యెపుడు|| అంటూ తన సాహితీ జ్ఞాపకాలను కవి తన సతితో పంచుకొంటాడు. జీవితమొక యాత్ర, జీవుడు యాత్రికుం/డగుచునుండ, మరల అన్ని యాత్ర/లందులలో కలిసియునంతయు నొక యాత్ర/ముగియుచుండు చివర ముద్దరాల|| అంటూ వియోగ భాధను తాత్వికంగా చెప్పుకొంటాడు. ఇలా తనతో తన సతి పంచుకొన్న అనేక ఆత్మీయ సందర్భాలను, మెట్టి నింట మురిసిన జ్ఞాపకాలను, తన దశాబ్దాల ఆత్మీయ కాపురాన్ని పలు పద్యాలతో అల్లి పద్యకృతికి సంపూర్ణ న్యాయం చేశారు. జక్కని పద్య ప్రతిభాపాటవాలు, పద్య రచనా చాతుర్యం ఇందులో ప్రతి పదములో భాషిస్తుంది. ఈ పద్య కృతి నూటికి నూరణాల మధుర జ్ఞాపకాల స్మృతి కావ్యం. భార్యా వియోగం ఎవ్వరికైనా బాధించే అంశమే. ఈ వియోగాన్ని చరితార్థం చేసేలా జక్కని వారు రాసిన ఈ వరలక్ష్మీ పద్యకృతి పాటకులను కదిలిస్తుంది. సతీవియోగాన్ని పారమార్థిక చింతనతో రాయడం ఈ కృతిలో ఉన్న ప్రత్యేకత. ఎవ్వరికైనా మృత్యువు తప్పదని ఈ కృతి నిరూపిస్తుంది. ఆధ్యాత్మిక, పారమార్థిక చింతన, భారతీయ తత్వ వివేచనలు, విశిష్టతలు ఈ కృతి చదవడం వల్ల తెలియవస్తుంది.

**నోటు:** ఇందు వెంట పద్యకృతి కవర్ పేజీ ఫోటో జత చేయనైనది.

**సంకేపల్లి నాగేంద్ర శర్మ**
(సమీక్షకులు) కరీంనగర్,
**చరవాణి: 80748 26371.**

# ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :**

యాసంగి 202324 వరి పంట కొనుగోలు నిమిత్తం ధాన్యము కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,కలెక్టర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్,జిల్లా ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.యాసంగి ధాన్యం కొనుగోలు,సిఎంఆర్ డెలివరీ,తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సి.ఎస్.సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు.జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.వీటిలో సహకార సంఘాల ద్వారా 325,ఐకెపి ఆధ్వర్యంలో 22 దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఏప్రిల్ మొదటి వారంలో బాన్సువాడ,బీర్కూర్,నసురుల్లాబాద్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతలకు అనుగుణంగా ప్రారంభించాలని చెప్పారు. ఎక్కడ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకుండా చూడాలని,అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ రైతుల వద్ద నుంచి మద్దతు ధర పై ఎక్కడ ఇబ్బందులేకుండా కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం దిగుబడి మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు.యాసంగి సీజన్లు గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాళ్ల 2 వేల 203 రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి క్వింటాళ్ల 2 వేల 183 రూపాయల మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మౌళిక వసతులు,టార్పాలిన్లు,క్లీనర్లు,వేయింగ్ యంత్రాలు,ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలని,ధాన్యం నాణ్యత ప్రమాణాలు,తేమ శాతం 17 లోపు ఉండాలనే అంశాలపై రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు.ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని,రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని కోరారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకుని వచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఖరీఫ్ 202324 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ భారత ఆహార సంస్థకు సకాలంలో డెలివరీ చేసే విధంగా రైస్ మిల్లులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ చందర్ నాయక్,జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు,జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య,కామారెడ్డి,ఎల్లారెడ్డి,బాన్సువాడ ఆర్డీవోలు రఘునాథరావు ,ప్రభాకర్,రమేష్,సిపిఓ రాజారాం,కలెక్టరేట్ ఎవో మసూర్ అహ్మద్,సహాయ పౌరసరఫరాల అధికారి నిత్యానంద్,తాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు.






# యువకుడి దారుణ హత్య

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చి 26 :**

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లి.రామేశ్వర్ పల్లి శివారులో ఓ యువకుడు మంగళవారం ఉదయం దారుణ హత్యకు గరయ్యాడు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కామారెడ్డి రూరల్ దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు.రంగం లోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు ఆరెపల్లి గ్రామానికి చెందిన బోయ నవీన్ (25) ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు ఉదయం తన తల్లి తండ్రులను పొలం వద్ద వదిలి ఆటో పై ఇంటికి వెళ్తున్న సమయం లో గుర్తు తెలియని వ్యక్తులు నవిన్ పై విచక్షణ రహితంగా కత్తులతో దాడి చేసి హత్య చేసి.పారిపోయారు.పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి హత్యకు గల కారణాలు తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నామని కామారెడ్డి రూరల్ సిఐ రామన్ తెలిపారు.



## ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- ఏప్రిల్ 12వరకు గడువు.ఏప్రిల్ 28న పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ వి రాధిక తెలిపారు

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 26 :**

కామారెడ్డి జిల్లా మర్కల్ నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నందు రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ గురుకులాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది.202425 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు టీఎస్ఆర్డీసీ సెట్ 2024ను ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్లు ఆయా విద్యాసంస్థలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్ ) కామారెడ్డి ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ఏప్రిల్ 21 నుంచి వెబ్సైట్లో అందు బాటులో ఉంటాయని తెలిపారు.దరఖాస్తు సహా ఇతర వివరాలకు వెబ్సై ట్ను సందర్శించాలని సూచించారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు పూర్తి ఉచితంగా విద్య,భోజన వసతితోపాటు యూనిఫామ్,పుస్తకాలు,నోట్ బుక్స్ సహా పలు సదుపాయాలను కల్పించ నున్నట్టు తెలిపారు. ప్రస్తుతం బీసీ గురుకులం పరిధిలో 15 బాలుర,15 మహిళా డిగ్రీ కళాశాలలు,ఎస్సీ గురుకులంలో 26 మహిళా కాలేజీలు,ఎస్టీ గురుకులంలో 6 బాలుర,15 మహిళా కళాశాలలున్నాయి.ఈ కాలేజీల్లో బీఏ,బీకామ్,బీఎస్సీ,బీబీఏ,బీహెచ్ఎంసీటీ,బీఎఫ్ సహా వివిధ కోర్సులు అందుబాటులో ఉండగా ప్రతి కోర్సులో 40 సీట్లున్నాయి.

# అన్నదాతల అరణ్య రోదన..

- ఆదుకున్న మాజీ జడ్పీటీసీ పడిగేలా రాజేశ్వర్ రావు

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో:**



కామారెడ్డి జిల్లా లోని రైతంగం నీళ్లు లేక బోరులు అడుగంటి పంట పొలాలు ఎండి పోతున్నాయి.ఈ రోజు రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామం లో కరంటు సరిగ్గా రాకుండా ట్రాన్సఫార్మర్ కాలిపోయింది.. రైతులు తల 500 రూపాయలు జామచేసుకొని ఖర్చులకు వసులు చేసి జిల్లా కేంద్రం లోని ప్రభుత్వం విద్యుత్ కార్యాలయంకు ట్రాక్టర్ లో బయలుదేరారు.ఇలా అనేక గ్రామాలు ఆగం అయితున్నాయి.ఈవిషయం తెలుసుకున్న మాజీ భారస నాయకులు రాజేశ్వరరావు,జిల్లా భారస నాయకులు శీను నాయక్ వెళ్లి రైతులతో మాట్లాడి వారి బాధను అడిగి తెలుసుకున్నారు. రాజేశ్వరరావు విద్యుత్ అధికారులకు చరవాణి ద్వారా మాట్లాడారు.పంటలు ఎండిపోతే విద్యుత్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆగ్రహం చెందారు.వెంటనే ట్రాన్సఫార్మర్ ఇప్పించారు అంతే కాకుండా కొత్త 25 కేజీ ట్రాన్సఫార్మర్ కు మంజురు ఇవ్వాలని అధికారులకు సూచించారు.అందుకు స్పందించిన అధికారులు 25 కేజీ ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతు 9 సంవత్సరంల నుండి ఒక్కసారి కూడ కరంటు మోటార్లు ట్రాన్సఫర్ మర్లు కాలిపోలేదని ఇప్పుడు మా పరిస్థితి ఇలా దాపూరించదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు మొట్టే శివయ్య, మెరుగు భూమయ్య,మెరుగు నరేష్,సంఘ జాడ సాయిలు,దువ్వాలా కుబేరం పాల్గొన్నారు.

# ఏ ముఖం పెట్టుకొని రైతుల వద్దకు వెళుతున్నారు ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టారు

- ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్


**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :**



బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల వద్దకు పంట నష్టం పరిశీలనకు వెళ్లడం పై స్పందించిన ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ మీ 10 సంవత్సరాల పాలనలో అనావృష్టి వల్ల ఆరుసార్లు పంట నష్టపోతే ఒక్కసారి కూడా పంట నష్టపరిహారం అందించలేదు కనీసం వారిని పరామర్శించిన పాపాన పోలేదు.ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టారు.అవినీతితో నిండిపోయి బిఆర్ఎస్ పార్టీ కంపు కొడుతుంది.కెసిఆర్ వేల కోట్ల అవినీతితో మేడిగడ్డ కృంగిపోయింది పంటలకు నీరు అందుతాయి అన్న రైతుల ఆశలు సన్నగిల్లాయి.లిక్కర్ కుంభకోణంలో కూతురు కవిత జైలుకెళ్ళింది.భూ కబ్జాలతో సంతోష్‌రావు,కన్నారావు ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ జైలుకుపోయే రోజులు దగ్గరపడ్డాయి. ఇక మీరు వెళ్లాల్సింది జైలుకు రైతుల వద్దకు కాదు అకాల వర్షాలు, వడగళ్ళు పంట నష్టం గ్రామాల్లో పంటల స్థితిగతులను క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలన సర్వే చేయించాం. రైతులు,కౌలు రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పినం రైతులు నిరాశ నిస్పృహలకు లోను కావద్దుని అండగా ఉన్నాం.పంట నష్టపోయిన ప్రతీ రైతును అన్నివిధాలా ఆదుకుంటాం. రాష్ట్రం మొత్తంలో నష్టం జరిగిన రైతులందరికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.రైతు సోదరుల ఆత్మైస్థైర్యం దెబ్బతినొద్దని ఆలోచించి సీఎం రేవంత్ రెడ్డి పంట నష్టంపై సర్వే చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించే చర్యలు తీసుకున్నారు.అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు నష్టపరిహారం అందించాలని నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్,హరీష్ రావు,కేటీఆర్ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే రైతులను పరామర్శించే హక్కు మీకు లేదు.అన్ని వ్యవస్థలను గత పాలకులు చిన్నాభిన్నం చేశారు.రైతులకు నగదు బదిలీ నిధులు నేరుగా ఖాతాలో జమా చేస్తున్నాం.ఇప్పటి వరకు 5 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు నగదు బదిలీ చేశాం.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో పంటల బీమా పథకం అమలు చేసింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకం ఆమలు చేయలేదు.పంట నష్టానికి కూడా నిధులు ఇవ్వలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించింది రైతుల పంట బీమా రుసుము కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

## ఢిల్లీ జె.ఎన్.యు లో ఎస్.ఎఫ్.ఐ కూటమి విజయం పట్ల సంబరాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్




**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 26 :**

ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో జరిగిన విద్యార్థి సంఘం ఎలక్షన్స్ లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మందు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్,బివిఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విటల్ లు మాట్లాడుతూ దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీలలో వామపక్ష విద్యార్థి సంఘాలు విజయం సాధించడం మంచి పరిణామం అని అన్నారు.మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి అనుబంధం విద్యార్థి సంఘం ఏబీవీపీ కి విద్యార్థులు సరైన బుద్ధి చెబుతున్నారని దీన్ని చూసేనా బీజేపీ మత రాజకీయాలను మానుకోవాలని,నూతన జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా జె.ఎన్.యు లో లౌకిక వామపక్ష శక్తులను గెలిపించిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ,బివిఎం నాయకులు బుల్లెట్ ,మణికంఠం,సచిన్,యోగి, మోహ న్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


## అన్నదానానికి ముందుకు రండి

- సేవా మార్గమే మానవ జీవితానికి సార్ధకత...
- మంగళవారం సందర్భంగా శ్రీ పరంజ్యోతి కల్కి భగవాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం




**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 26 :**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ లో గల శ్రీ పరంజ్యోతి కల్కి భగవాన్ ఆలయంలో మంగళవారం సందర్భంగా గత మూడు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఈ రోజు కూడా నిర్వహించడం జరిగింది. నేటి అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా గంగెల్లి వీరప్రసాద్ మౌనిక బిక్కనూర్ ముందుకు రావడం జరిగింది.వీరికి శ్రీ పరంజ్యోతి కల్కి సేవా సమితి తరపున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.అన్నదానానికి ముందుకు రావాలని మానవ జీవితానికి సేవతోనే సార్ధకత చేకూరుతుందని అన్నదానం చేయాలనుకున్నవారు ఎర్రం చంద్రశేఖర్ 9849601438 కి సంప్రదించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు డాక్టర్ బాలు,కొమ్మిరిశెట్టి దిగంబర్,పప్పుల శ్రావణి రాజేంద్రప్రసాద్,పబ్బ జ్యోతి,పాత స్వరూప,కొడిశాల గంగాధర్,సిద్ధంశెట్టి సంతోష్ లు పాల్గొనడం జరిగింది.




# శాంతి కోసం పరుగెత్తండి

- IIFL JITO అహింసా రన్ 2వ ఎడిషన్ శాంతి & అహింస కోసం మార్చి 31న జరగనుంది.
- ఈ రన్ భారతదేశం అంతటా 69 ప్రదేశాలలో, భారతదేశం వెలుపల 20 ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించబడుతుంది

**జయభేరి, హైదరాబాద్, మార్చి 26 :**

IIFL JITO రెండవ ఎడిషన్ 'అహింసా రన్ ఫర్ పీస్ అండ్ అహింస' ఆదివారం, 31 మార్చి 2024న జల విహార్, PV నరసింహారావు మార్గ్, హైదరాబాద్లో ఉదయం 05:30 గంటలకు జరుగుతుంది. మంగళ వారం విడుదల చేసిన ప్రెస్ నోట్లో వివరాలను తెలియజేస్తూ, ఇది అద్వితీయమైన పరుగు అని JITO హైదరాబాద్ చైర్మన్ పరేష్ షా, ప్రధాన కార్యదర్శి BL భండారి కోశాధికారి సుశీల్ సంచేటి తెలిపారు. రన్నింగ్ కేటగిరీలు 3K, 5K, 10K సార్లు పరుగులు. మూడు వేల మంది పాల్గొనే అవకాశం ఉంది. 10K టైమ్డ్ పరుగుల కోసం మొత్తం ప్రైజ్ మనీ రూ. 90,000 (తొంభై వేలు). పరుగు కోసం మార్గం జలవిహార్ నుండి సంజీవయ్య పార్క్ వైపు ఉంటుంది. మహిళా విభాగం JITOచే నిర్వహించబడింది. JITO అనేది సామాజికఆర్థిక సాధికారత, విలువకేంద్రీకృత విద్య, సమాజ సంక్షేమానికి కట్టుబడి ఉన్న అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ. మారథాన్లు, సామాజిక కార్యక్రమాల రంగంలో, JITO అహింసా రన్ 2.0 స్ఫూర్తి, మార్పుకు ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఒకే రోజు, ఒకే సమయంలో నిర్వహించబడుతుంది. భారతదేశంలోని 69 స్థానాల్లో, అంతర్జాతీయంగా 28 స్థానాల్లో 100,000 మంది వ్యక్తులు పాల్గొనడంతో, ఇది JITO యొక్క కార్యక్రమాల ప్రపంచ ప్రభావాన్ని చూపుతుంది. గత సంవత్సరం జరిగిన ఈవెంట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ను నెలకొల్పింది. శ్రీమతి వీణా జైన్, చైర్పర్సన్, శ్రీమతి. టీనా షా చీఫ్ సెక్రటరీ, JITO హైదరాబాద్ లేడీస్ వింగ్తో పాటు, JITO యూత్ వింగ్ నుండి శ్రీమతి రేణు చోర్డియా, రాహుల్ షా పెద్ద సక్సెస్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. JITO హైదరాబాద్ గురించి మరింత తెలుసుకోవడానికి దయచేసి https://jitohyderabad.org/aboutus/ని సందర్శించండి. రిజిస్టర్ నమోదు చేసుకోవడానికి: www.ifinish.in సందర్శించండి. రిజిస్టర్ చేసుకోవడానికి చివరి తేదీ: మార్చి 28, 2024.









# నందమూరి వారసుడు మోక్షజ్ఞ వచ్చేస్తున్నాడు.. దర్శకుడు ఎవరంటే..?



ఇప్పుడు కాదు మూడు నాలుగేళ్లుగా నందమూరి వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా వేచి చూస్తున్నారు. ఎప్పుడెప్పుడు జూనియర్ బాలయ్య వస్తాడా.. రికార్డుల మోత మోగిస్తాడా అని వేచి చూస్తున్నారు వాళ్లు. కానీ మోక్షు మాత్రం రావట్లేదు. బాలయ్య కూడా జూనియర్ బాలయ్య ఎంట్రీ గురించి కచ్చితమైన సమాచారం ఇవ్వట్లేదు. దాంతో నందమూరి అభిమానులు కూడా విసుగు వచ్చి వారసుడి ఎంట్రీ గురించి ఆరా తీయడం మానేసారు. కానీ పరిస్థితులు చూస్తుంటే టైమ్ వచ్చినట్లే అనిపిస్తుంది. నందమూరి ఫ్యామిలీ నుంచి కొత్త హీరో రాకకు సమయం ఆసన్నమైనట్లే అనిపిస్తుంది. దానికి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా నందమూరి కుటుంబం అంటేనే మాస్.. మరి వారసుడు వచ్చినపుడు దానికి తగ్గ కథ కూడా దొరకాలి కదా.. అందుకే ఈ వెయిటింగ్ అంటున్నారు బాలయ్య. 20 ఏళ్లుగా నందమూరి ఫ్యామిలీ నుంచి వారసులు రాలేదు. కళ్యాణ్ రామ్ వచ్చి కూడా 20 ఏళ్లు అవుతుంది. అన్ని కుటుంబాల నుంచి వారసులు తక్కువ వయసులోనే ఎంట్రీ ఇచ్చారు. అక్కినేని కుటుంబం నుంచి అఖిల్ 20 ఏళ్లకు వస్తే..రాంచరణ్ కూడా అప్పట్లో 22 ఏళ్లకే వచ్చేసాడు.. బన్నీ అయితే మరీ 18 ఏళ్లకే వచ్చేసాడు.. నాగచైతన్య 22 కు వచ్చాడు. జూనియర్ ఎన్టీఆర్ అయితే 17 ఏళ్లకే హీరో అయిపోయాడు. ఇప్పుడు మోక్షజ్ఞ వయసు 26 వచ్చేసింది.. అయినా కూడా ఇప్పటికీ సినిమాల్లోకి రాలేదు. అందుకే చాలా ఏళ్లుగా మోక్షు సినిమాల్లోకి వస్తాడా రాడా అనే చర్చ అయితే నడుస్తుంది. ఇప్పట్లో మా వాడు రాడు అంటూ బాలయ్య కూడా క్లారిటీ ఇచ్చాడు. కానీ ఇప్పుడు అదే బాలయ్య తన వారసుడు సిద్ధం అవుతున్నాడని చెప్పాడు. కథ కూడా సిద్ధం అవుతుంది. యాక్టింగ్ స్కూల్‌లో కూడా జాయిన్ అయ్యాడు మోక్షజ్ఞ. అనిల్ రావిపూడి, క్రిష్‌లలో ఎవరో ఒకరు మోక్షు మొదటి సినిమాను తెరకెక్కించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది. మరోవైపు బాలయ్యే స్వయంగా ఆదిత్య 999తో కొడుకును లాంఛ్ చేయాలనే ప్రయత్నాలు కూడా చేస్తున్నాడు.

# లక్నోలో డిష్యుం.. డిష్యుం..



జయాపజయాలకు అతీతంగా వేగంగా సినిమాలు చేసుకుంటూ దూసుకుపోతున్నారు రవితేజ. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈచిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. తాజాగా షెడ్యూల్‌ని లక్నోలో మొదలుపెట్టారు. ఈ కీలక షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించనున్నారు హరీశ్‌శంకర్. 'నామ్ తో సునా హోగా' అనే ఉపశీర్షికతో రూపొందుతోన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో సరికొత్త రవితేజను ఆడియన్స్ చూస్తారని హరీశ్‌శంకర్ చెబుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టి.జి.విశ్వప్రసాద్.



# 'దేవర' సెట్స్‌లోకి జాన్వీ

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీకపూర్ టాలీవుడ్‌లో గ్యాప్ లేకుండా షూటింగ్‌లో పాల్గొటుంది. ఇప్పటికే ఈ భామ తెలుగులో దేవర సినిమాతో పాటు.. ఆర్‌సీ 16 సైన్ చేసిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఆర్‌సీ16 పూజ కార్యక్రమలు జరుపుకోగా త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. అయితే ఈ సినిమా ఓపెనింగ్ కారణంగా హైదరాబాద్ వచ్చిన జాన్వీ మళ్లీ దేవర షూటింగ్‌లో పాల్గొనడానికి గోవా వెళ్లింది. దేవర సినిమాకు సంబంధించి ఇటీవల కొత్త షెడ్యూల్ గోవాలో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటికే చిత్ర హీరో ఎన్టీఆర్‌తో పాటు చిత్రయూనిట్ అంతా గోవా వెళ్లారు. అయితే తాజాగా జాన్వీ కూడా షూటింగ్‌లో జాయిన్ అవ్వడానికి గోవా వెళ్లింది. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో తెలుపుతూ.. మరోసారి తంగం రోల్ చేసేందుకు ఇక వేచి ఉండలేను అంటూ రాసుకోచ్చింది. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్ బస్టర్ తరువాత జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో శ్రీదేవి గారలపట్టి జాన్వీకపూర్ మరాఠీ భామ శృతి మరాటే కథనాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల చేయనున్నారు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఈ మూవీని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# కౌంటర్ ఇచ్చిన ఆదాశర్మ

బాలీవుడ్ నటి ఆదాశర్మ ఓ నెటిజన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. గతేడాది ఆదాశర్మ నటించిన సూపర్ హిట్ చిత్రం ది కేరళ స్టోరీ. ఈ సినిమాపై విడుదలైన అనంతరం విపరీతమైన ట్రోలింగ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రం ముస్లింలను టార్గెట్ చేస్తూ వారే విలన్లు అంటూ ఉండడంతో ఇది ఇక ప్రోపగండ మూవీ అని అసలైన కేరళ స్టోరీ కాదని నెటిజన్లు తిప్పికోట్టారు. అయితే రంజాన్ మాసం సందర్భంగా తాజాగా ఓ ఇఫ్తార్ పార్టీకి హాజరయ్యింది ఆదాశర్మ. తాజాగా ఈ వీడియో సోషల్ మీడియా వైరల్‌గా మారడంతో ఓ నెటిజన్ ఆదాశర్మను విమర్శిస్తూ పోస్టు పెట్టాడు. నార్మల్ రోజులలో ముస్లింలను విలన్లుగా చిత్రికరిస్తూ వారిపై ద్వేషపూరిత సినిమాలు చేస్తుంది. అదే ఈవెన్ డేస్‌లో ముస్లింలు గొప్పవారు.. ఎందుకంటే నన్ను బిర్యానీ కోసం ఇన్‌వైట్ చేశారు. ఈమె ఎంత మోసం చేస్తుంది జనాలను అంటూ పోస్టు పెట్టాడు. దీనికి కౌంటర్‌గా ఆదాశర్మ డియర్ సర్.. ఏ రోజు అయిన సరే ఉగ్రవాదులు అనే వాళ్లు విలన్లు. ముస్లింలు కాదు అంటూ స్ట్రాంగ్ రిప్లయ్ ఇచ్చింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com